హైదరాబాద్ వార్త

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం : కమిషనర్ శరత్‌చంద్ర

నార్సింగి, జూన్ 4 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించిన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో పరిసరాల పరిశుభ్రత-ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని కమీషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆయన పర్యటించి ప్రభుత్వం ఆదేశించిన యాక్షన్ ప్లాన్‌పై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వార్డు ఆఫీసర్లు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆయా వార్డుల పరిధిలో ఉన్న సమస్యలను తెలుసుకొని నా దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ముఖ్యంగా వచ్చే వర్షా కాలంలో ప్రజలు ఇబ్బందుల పాలవకుండా, అనారోగ్యం పాలవకుండా పకడ్బంధీ చర్యలు తీసుకోవాలన్నారు. నాలాల్లో పూడికలు తీయించాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని, చెత్త రోడ్లపై వేయకుండా ప్రజలకు మరింత అవగాహన పెంచాలని తెలిపారు. ప్రజల సహకారం ఉంటేనే ఏ కార్యక్రమమైనా విజయవంతం అవుతుందని, కాలనీ సంఘాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలకు చెందిన ప్రజల సేవలు విని యోగించుకోవాలని కమీషనర్ శరత్‌చంద్ర సిబ్బందికి సూచించారు. వరద

బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో వందరోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో పాల్గొన్న కమీషనర్ బి.శరత్‌చంద్ర దృశ్యం

నీరు రోడ్లపై నిలువ కుండా చూడాలని, మ్యాన్‌హోళ్లు, నాలాలు పొంగి పొర్లకుండా సాఫీగా వరద నీరు కిందికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, డ్రైనేజి, వీధి దీపాలు, మంచినీరు వంటి ప్రధాన సమస్యలు తలెత్త కుండా పకడ్బంధీగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఇ యాదయ్య, వెంకట్‌రెడ్డి, వర్క్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.

వాడివేడిగా 'జిహెచ్ఎంసి కౌన్సిల్ మీటింగ్'

-సమస్యలపై అధికార, విపక్షాల మధ్య చర్చ

-స్పోర్ట్స్,వీధిదీపాలు, టౌన్‌ప్లానింగ్‌లపైనే సభ్యుల ప్రశ్నలు

-మొదటిసారిగా మేయర్‌గా వ్యవహరించిన డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి

హైదరాబాద్, జూన్ 4,ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 11వ కౌన్సిల్ సమావేశం వాడీవేడీగా జరింది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం, కార్పొరేటర్లతోపాటు ఎక్స్ అఫిషియో సభ్యులుగా మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్, మెదక్ ఎంపి రఘునందన్ రావులతోపాటు గ్రేటర్‌పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ కమిషనర్ ఆర్.వి కర్ణన్, అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు హాజరయ్యారు. ఉదయం 10.30గంటలకు సభ ప్రారంభం కాగా రాత్రి 7గంటలకు ముగిసింది. సభ ప్రారంభం కాగానే పహల్గామ్ మృతులకు సభ్యులు నివాళ్లు అర్పించారు.ఈ దాడిలో మరణించిన కుటుంబ సభ్యలకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీలో చేపట్టే మౌలిక సదుపాయాల అభివృద్ధికి, సంక్షేమానికి నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చి నిధులు మంజూరు చేస్తూ బల్దీయా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తావించారు. నగర ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. అందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. నగరంలో ముందస్తు మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్ వలన ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి గల్లీని పరిశుభ్రం చేయడమే ప్రధాన లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి పరిశుభ్రమైన నగరంగా ఉండేందుకు దోహద పడుతుందని, అందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్లమెంటు సభ్యులను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని అధికారులను కోరారు. నగరంలో ప్రజా సమస్యలను పరిష్కరించుటకు జోనల్ వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, ముందుగా ఎల్బీనగర్ జోన్ లో నిర్వహించి ఆ సమావేశంలో కార్పొరేటర్లు అడిగిన సమస్యల పరిష్కారం కోసం తగు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. మిగతా జోన్ లలో కూడా శానిటేషన్, డిసిల్టింగ్, నాలా అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేసేందుకు అధికారులతో కార్పొరేటర్లు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు మేయర్ వివరించారు.

మొఘల్ పుర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రభుత్వ కార్యాలయం ఉన్నందున క్రీడలకు అంతరాయం ఏర్పడుతుందని, క్రీడాకారులు తయారు కావడానికి కార్యాలయాన్ని వెంటనే అక్కడి నుండి తొలగించాలని సయ్యద్ సోహెల్ ఖాద్రి కోరారు. ఈ విషయం పై కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోయినుద్దీన్ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ మెటీరియల్‌ను, సమ్మర్ కోచింగ్ లో కాకుండా ముందస్తుగా ఇవ్వాలని తెలిపారు. ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ మాట్లాడుతూ కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను కూడా అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నందున యువత క్రీడల్లో రాణించాలన్నారు. అంబర్ పేట్ కార్పొరేటర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ... అంబర్ పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో కోచ్ లేడని తెలిపారు. వనస్థలిపురం ప్రభుత్వ ప్లే గ్రౌండ్ లో ప్రైవేట్ వ్యక్తులు స్కేటింగ్ రుసుం వసూలు చేస్తున్నారని కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లు స్థానికంగానే ఇవ్వాలి : ఎంపి ఈటెల రాజేందర్

గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతంలో పేద వాళ్లు ఎక్కువగా ఉన్నారని, ఇందిరమ్మ ఇళ్లను స్థానిక ప్రదేశంలో ఇవ్వాలని, దూర ప్రదేశంలో ఇవ్వవద్దని ఈటెల రాజేందర్ తెలిపారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో మౌలిక వసతులు సరిగా లేవని అందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని తెలిపారు. నగరంలో ఏర్పడే కొత్త కాలనీలలో భవిష్యత్తు ప్రణాళికతో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఎస్.ఎన్.డి.పి ద్వారా నాలా అభివృద్ధి పనులు చేపట్టాలని, పార్కు స్థలాలను కాపాడాలని, జలమండలి, జీహెచ్ఎంసి సమన్వయంతో వర్షాకాలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైల్వే లైన్ల ద్వారా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నివారించడానికి అండర్ పాస్ ల నిర్మాణానికి రైల్వే శాఖ రాష్ట్ర ప్రభుత్వంతో కంట్రిబ్యూషన్ లేకుండా నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. బొల్లారం వద్ద నిధులు మంజూరై ఇప్పటికి 20 ఏళ్లు అయినా ఇంకా ప్రారంభించలేదని అన్నారు. నగరంలో ఆఫీస్ లో కంటే ట్రాఫిక్ లో ఇబ్బందుల పడుతున్నారని తెలిపారు. అలాగే ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెండో అధికార భాష ఉర్దూ ఉన్నందున అధికారులు వెంటనే ప్లెఓవర్లకు ఉర్దూ భాషలో పేర్లు పెట్టాలని ఆయన కోరారు.

మొట్టమొదటి సారిగా మేయర్‌గా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి..

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మొట్టమొదటి సారిగా సభకు అధ్యక్షత వహించారు.ఈసందర్భంగా ఆమె బర్త్ అండ్ డెత్ అంశం పై చర్చ నిర్వహించారు. సభ్యులు లేవనెత్తిన పలు ప్రశ్నలకు అధికారులతో సమాధానం ఇప్పించారు. టీ బ్రేక్ అనంతరం తిరిగి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షత వహించి సమావేశానికి కొనసాగించారు. ఈ సమావేశంలో జపాన్ బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సమావేశం పూర్తయ్యే వరకు వారు సభ తీరును పరిశీలించారు.ఈ సమావేశంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, శానిటేషన్, బర్త్ అండ్ డెత్, వీధి లైట్లు, అడ్వర్టైజ్మెంట్, డిసిల్టింగ్ తదితర అంశాలపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయా విభాగాల అధికారులు వివరణ ఇచ్చారు.ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు విజయశాంతి, బల్మూరి వెంకట్, మిర్జా రియాజ్ ఉల్ హస్సన్ ఎఫెంది, మిర్జా రహమత్ బేగ్, అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు జుల్ఫికర్ అలీ, మాజీద్ హుస్సేన్, కౌసర్ మోయినుద్దీన్, రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కమీషనర్ ఆర్.వి.కర్ణన్, అడిషనల్ కమీషనర్లు స్నేహ శబరీష్, వేణుగోపాల్, వేణుగోపాల్ రెడ్డి, పంకజ, సుభద్ర, మెయింటెనెన్స్ సి.ఇ సహదేవ్ రత్నాకర్, ప్రాజెక్ట్ సి.ఈ భాస్కర్ రెడ్డి, జోనల్ కమీషనర్లు అపూర్వ్ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహదేవ్ రావు, రవికిరణ్, వెంకన్న, సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయికి మేకలమండి ప్రభుత్వ పాఠశాల నిర్మాణం

-శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను సత్వరమే తొలగించాలి

-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్, జూన్ 4,ప్రభాతవార్త: సికింద్రాబాద్ క్రిష్ణనగర్ కాలనీ మేకలమండి ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు ధీటుగా నిర్మించడంతో పిల్లల సంఖ్యను మరింతగా పెంచాల ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ హైదరాబాద్ లోని పలు ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. తొలుత నాంపల్లి లోని ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలను, సికింద్రాబాద్ కృష్ణానగర్ లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, యూసుఫ్ గూడ లోని ప్రాథమికోన్నత పాఠశాలను అలాగే బోరుబండలో ప్రభుత్వ బాలుర హైస్కూల్ ను సందర్శించి చేపడుతున్న పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ కృష్ణానగర్ మేకలమండి లో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల నిర్మాణం అద్భుతంగా ఉందని కాంట్రాక్టర్ కృష్ణారెడ్డిని అభినందించారు. ఈ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయికి తగ్గట్టుగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయటం తో పిల్లల సంఖ్యను 1000 కి పెంచాలని ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలోని పిల్లల హాజరు శాతం, ఉపాధ్యాయుల సంఖ్య, ఖాళీల వివరాలు, నీటి వసతులు అడిగి తెలుసుకున్నారు. ఎనిమిదో తరగతి పుస్తకాలను త్వరలో అందిస్తామని అలాగే పాఠశాల గోడలపై విద్య యొక్క ఆవశ్యకత గురించి ఇంగ్లీషు లో స్లోగన్స్ వ్రాయించాలని హెచ్ఎం ను ఆదేశించారు. పాఠశాల హెచ్ఎం వాల్ పెయింటింగ్స్ అలాగే కాంపౌండ్ వాల్ కు ఐరన్ ఫ్రేమ్ ఏర్పాటు చేయవలసిందిగా కలెక్టర్ కు విజ్ఞప్తి చేయగా సత్వరమే పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.నాంపల్లి లోని ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించి అదే ఆవరణలో గల మూడు పాత భవనాలను కమిటి నిర్ణయం తర్వాత తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు బయటికి వెళ్లే సౌకర్యం లేకపోవడంతో డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ తో తరగతి గదుల్లో చేపట్టిన మరమ్మత్తు పనులు, ఎలక్ట్రికల్ వర్క్స్, మరుగుదొడ్లు మరమ్మత్తులు, త్రాగునీరు ఏర్పాటు అలాగే పాఠశాల ఆవరణలో స్టేజి నిర్మాణం పనులను పరిశీలించి మిగిలి ఉన్న పనులను తత్వరమే చేపట్టాలని బడిబాట కార్యక్రమంలో పిల్లల సంఖ్యను250 మందికి పెంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలోఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షఫీ మియా, డి ఈ ఆశీర్వాదం, తాసిల్దారులు ప్రేమ్ కుమార్, నయీ ముద్దీన్, పాండు నాయక్, ప్రధానోపాధ్యాయులు రజిని, స్వరూప, గీత, ఎస్ ఎల్ ఎఫ్ భవిత ఉపాధ్యాయులు, మదర్స్ కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు

చెరువులో చేపల వేటకు వెళ్ళి వ్యక్తి మృతి..

పేట్ బషీరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త

చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో గుడ్ల పోచంపల్లిలోని సోకాయికుంట చెరువులో చేపలు పడదామని గుండ్ల పోచంపల్లికి చెందిన చంచల నాగరాజు తండ్రి బాలయ్య (48) వెళ్లగా ఇతనితో పాటు బండారు దేవేందర్, రాజులు కూడా వెళ్ళారు. రాత్రి వేసిన వలలు తీద్దామని వెళ్ళగా ప్రమాద వశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. ఈ విషయంపై మృతిని భార్య చంచల లలిత ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాగ్‌లో మహిళ మృతదేహం..

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొంపల్లి, జూన్ 4, ప్రభాతవార్త

గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని బాచుపల్లి పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం బుధవారం విజయదుర్గా ఓనర్స్ అసోసియేషన్ కాలనీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ పక్కన నిర్మానుష్య ప్రాంతంలో ఒక బ్యాగు పడి ఉండడం అందులో నుండి దుర్వాసన రావడంతో స్థానికులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి చూడగా ఆ బ్యాగులో గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం ఉంది. సుమారు 25 నుండి 30 సంవత్సరాల లోపు గల యువతి మెరూన్ కలర్ పంజాబీ డ్రెస్ ధరించి ఉంది. అయితే ఆ మహిళను ఎక్కడో చంపేసి మృతదేహాన్ని బ్యాగులో వేసుకొని ఇక్కడికి తీసుకొచ్చి పడవేసినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలాన్ని బాలనగర్ డిసిపి కే సురేష్ కుమార్ ఐపిఎస్ సందర్శించి స్థానిక పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హత్యగావించబడిన మహిళను గుర్తించడం, అనంతరం హత్యకు గల కారణాలను అన్వేషించి అందుకు కారకులైన వారిని అరెస్టు చేసే దిశగా పోలీసులు ముమ్మర గాలింపును చేపట్టారు. అయితే మృతదేహం కుళ్ళిపోయిన విధానాన్ని బట్టి సుమారు ఐదు రోజులకు ముందే మృతదేహాన్ని ఇక్కడ పడవేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. పరిసరాల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ వయసు గల మహిళల మిస్సింగ్ కేసులను బాచుపల్లి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ హెచ్ ఓ ఉపేందర్ రావు తెలిపారు.

చెరువుల అభివృద్ధిలో వేగం పెరగాలి

- హైడ్రా కమిషనర్ రంగనాథ్

చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఎ.వి రంగనాథ్

హైదరాబాద్, జూన్ 4,ప్రభాతవార్త: చెరువుల అభివృద్ధి పనుల్లో వేగాన్ని పెంచాలని హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ ఆదేశించారు. ఈవర్షాకాలం చెరువులన్నీ స్వచ్ఛమైన నీటితో కళకళలాడాలని సూచించారు. నగరంలో మొదటి విడతగా చేపట్టిన 6 చెరువుల అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఈ క్రమంలో మంగళవారం బతుకమ్మకుంట, భమృక్‌నుద్దౌలా చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ తమ్మిడికుంట, సున్నం చెరువులను బుధవారం సందర్శించారు. అక్కడి పనుల పురోగతిని పరిశీలించారు. 14ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ్మిడికుంటను 26 ఎకరాల మేర నీరు నిలిచేలా.. మరో 4 ఎకరాల్లో పర్యావరణానికి పెద్ద పీట వేయాలని సూచించారు. చెరువు బండ్ బలంగా ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. చెరువు కింద లోతట్టు ప్రాంతంతో పాటు.. భవనాలు ఉన్న దృష్ట్యా బండ్‌కు వెలుపల భాగంలో కాంక్రీట్ గోడ నిర్మించాలన్నారు. పనులకు ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సున్నం చెరువును కమిషనర్ సందర్శించారు. సున్నం చెరువు మొత్తం 32.20 ఎకరాలు కాగా.. ఇప్పుడు కేవలం 14.18 ఎకరా ల్లోనే నీరు నిలుస్తోంది. దీనిని పూర్తి స్థాయికి విస్తరించాలని అన్నారు. అలాగే చెరువు లోతును కూడా పెంచాలని సూచించారు. ఈ మేరకు చెరువులో మురుగును బయటకు పంపి దుర్గంధభరిత మట్టిని కూడా హైడ్రా తొలగించింది. ఈవర్షాకాలంలో స్వచ్ఛమైన నీరు నిలిచేలా ఏర్పట్లు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంపై 'మాక్‌డ్రిల్'

హైదరాబాద్, జూన్4, ప్రభాతవార్త: అగ్నిప్రమాదంపై చేపట్టాల్సిన భద్రత చర్యలు, బాధితుల కాపాడడంపై తూకారంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ భవనంలో బుధవారం 'మాక్‌డ్రిల్' నిర్వహించారు. అగ్నిమాపక శాఖతో సహా ఆయా శాఖలు కలిసి వీలైనంత త్వరగా ఘటనస్థలానికి రావడం, ఒక్కొక్క విభాగం సమన్వయం చేసుకొని జాగ్రత్తలు తీసుకోవడంపై చాలా చక్కగా ప్రదర్శించారు.

ఫిర్యాదులొస్తే..పండగే...!

- పలు పోలీస్‌స్టేషన్లలో ఇరువర్గీయుల సెటిల్మెంట్లు

- కేసుల్లో తీవ్రత ఉన్న ఎఫ్ఐఆర్ చేయని పోలీసులు

- కలిననేరస్తులను తప్పించడంతో నష్టపోతున్న బాధితులు

హైదరాబాద్ జూన్4, ప్రభాతవార్త: చిన్నపాటి నేరాలైనా...కఠిన దారుణాలైన పోలీసులు తమదైన శైలీలో బాధితులను బుజ్జగించి కరడుగట్టిన నేరస్తులతో రాజీకుదురుస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. నగరంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో కొన్ని పోలీస్‌స్టేన్లు సెటిల్మెంట్లకే ఉపయోగిస్తున్నారని తెలుస్తుంది. కుటుంబ గొడవల నుంచి హత్యలు, అత్యాచారాలు, వివిధ రకాల నేరాలను సైతం నిందితులను తప్పించి భారీస్థాయిలో సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇక రాజకీయ నేతల అండదండలు, సంపన్న వర్గాల పిల్లలు, ఇతర పైరవీలతో నేరస్తులను తప్పించి శాంతిభద్రతల సమస్యలను పెంచుతున్నారని తెలుస్తుంది. సాధారణంగా ఫిర్యాదు వస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. అలా కాకుండా చట్టానికి విరుద్దంగా కొందరు పోలీసులు వ్యవహరించడంతో అక్రమార్కులు, నేరస్తులు మరింతగా రెచ్చిపోయి దౌర్జాన్యాలకు పాల్పడుతున్నారు. దర్యాప్తులు, విచారణలు లేకుండా తీవ్రమైన కేసులను కూడా లైట్‌గా తీసుకోవడంతో పెద్ద నేరాలు జరిగే ఆస్కారం ఉంటుందని సామాజిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తప్పులు చేస్తే సమర్థించడం కరెక్టా.?

తెలిసి తప్పులు చేసినా..తెలియకుండా నేరాలకు పాల్పడినా చర్యలు ఉండాల్సిందే. చట్టం ముందు అందరు సమానమనే వ్యాఖ్యలు పోలీసులకు వర్తించవనే విధంగానే నగరంలో కనిపిస్తున్నాయి. చోటా,మోటా బడానేతలంతా పైరవీలతో రూ. లక్షలు, కోట్లు సంపాదిస్తూ అక్రమార్కులు, నేరస్తులను తప్పించడంతో పరోక్షంగా పెద్ద నేరాలకు ఆజ్యం పోస్తున్నట్లే అర్థమవుతుంది. తప్పులు చేస్తే మరోసారి చేయకుండా కఠినంగా వ్యవహరించాల్సిన పోలీసులు నేరస్తులను వెనుకేసుకొని రావడంతో న్యాయం కోసం వచ్చే బాధితులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేవలం సామాన్యులకే సమస్యలు, కేసులు, శిక్షలు అనేవిధంగా పోలీస్‌స్టేషన్లు మారాయని బాధితులు ఆరోపిస్తున్నారు. అన్యాయం జరిగిందనే ఫిర్యాదు చేస్తే రోజుల తరబడి స్టేషన్ల చుట్టు తిరిగాల్సిన దుస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైన పలుకబడి ఉన్న వారుంటేనే కానీ స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కావనే వాదనలు ఉన్నాయి. ఒక నిందితుడిపై పలు ఫిర్యాదులు చేసిన కనీసం దర్యాప్తు చేయకుండా కూడా వదిలేస్తున్నారు. అదేవిధంగా ఎం తప్పు చేయని వారిపైన కేసులు నమోదు చేసి సమగ్రదర్యాప్తు, విచారణలు జరపకుండా కోర్టుల ముందు దోషిగా నిలబడుతున్నారని పలువురు చెబుతున్నారు. సౌత్ జోన్‌లోని ఒక పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఇరువర్గాల దాడిలో రాజీ ఘటన జరిగిందనే తెలుస్తోంది.

శిక్షలతోనే నేరాలు తగ్గుముఖం...

ఏమైన సమస్యలు, అక్రమాలపై ఫిర్యాదులొస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయడం పోలీస్ రికార్డులో తొలి ప్రాముఖ్యత. నేరస్తుల గురించి తెలుసుకునేందుకు చాలా ఉపయోగపడుతుందని సామాజిక నిపుణులు గతంలో కేసుల నమోదు, అక్రమాలు, నేరాల విషయాలు బహిర్గతమవుతాయని వివరిస్తున్నారు. అలాంటివి ఏం చేయ కుండా పైరవీలతో తప్పిస్తే మరెన్నో దారుణాలకు ఒడిగట్టే అవకాశం లేకపోలేదని పేర్కొంటున్నారు. అందుకు పరోక్షంగా పోలీసులే కారణమని అనక తప్పదు. చిన్న ఘటనలపైన నమోదైన కేసుల్లో కూడా భయం ఉండేలా చర్యలు ఉండాలనే అభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా పోలీస్ స్టేషన్లను ఉన్నతాస్థాయి అధికారులు ఫిర్యాదులు, కేసులు, శిక్షలపై ఆరా తీయాలని, ఏమైన అను మానాలు ఉంటే సంబంధిత ఇన్వెస్టిగేషన్ అధికా రులతో చర్చించడంతో కేసుల పరిణామాలు తెలు స్తాయని అంటున్నారు. డబ్బుల మోసాలు, గొడు వలు, బెదిరింపులు, హత్య ప్రయత్నాలతో నలిగి పోతున్న బాధితులకు పోలీసులు అండగా నిలబడి న్యాయం చేకూరేలా మెరుగైన సేవలందింస్తే నమ్మకం ఏర్పడుతుంది. అంతేకాకుండా చిన్నపాటి నేరస్తులపై ఉన్న అభియోగాలతో చర్యలు చేపడితే మరోతప్పు చేయకుండా ఉంటారని అభిప్రాయపడుతున్నారు.

సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై శ్రీవారి ఊరేగింపు

సైఫాబాద్, జూన్ 4 ప్రభాతవార్త: హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 20వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి ఉదయం 5 గంటలకు సుప్రభాతం సేవతోపాటు రాత్రి చంద్రవాహనంపై ఊరేగింపు వరకు అన్ని సేవలు ఘనంగా వైభవంగా కన్నుల పండువలాగా జరిగాయి. శ్రీవారికి అన్ని సేవలతోపాటు బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు కొనసాగింది. పదిన్నర గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు సహస్రదీపాలకరణ, రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు అంగరంగ వైభవం జరిగింది. ఊరేగింపులో పాల్గొన్న భక్తుల గోవిందనామాస్మరణలు మారుమ్రోగాయి, కళాకారుల సన్నాయి రాగాలు, మేళ తాళాలు, భజనలు, మహిళల నృత్యాలు, కోలాటం ప్రదర్శన అద్భుతంగా జరిగింది. పురవీధులన్ని అధ్యాత్మికతో నిండిపోయాయి. దేవాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా భక్తులకు తీర్థప్రాదాలతోపాటు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కూడా వేలాది మంది

పురవీధుల్లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు

భక్తులు పాల్గొన్నారు. భక్తులకు డోనర్ త్రినాథ్‌బాబు, టిటిడి ఎఇవో యు. రమేష్, డోనర్ త్రినాథ్‌బాబు, టిటిడి ప్రతినిధులు శ్రీనివాస్‌ప్రభు, శ్రీనివాస మణికంఠ, నిరజా, లక్ష్మీపతి, టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి, ప్రతినిధి హరినాథ్, శ్రీవారి సేవకులు, ఉద్యోగులు, సిబ్బంది, పోలీసులు విశేషమైన సేవలు అందించారు.

ఆరోగ్యకరమైన ఆహార తయారీపై శిక్షణ

అత్తాపూర్ జూన్4,ప్రభాతవార్త :

పీజేటీఏయూ లోని కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో ఆహారము మరియు పోషణ విభాగం ఆధ్వర్యంలో పీఎం పోషణ (మధ్యాహ్న భోజన పథకం)కి అనుగుణంగా పరిశుభ్రతతో కూడిన ఆరోగ్యకరమైన ఆహార తయారీపై శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం లో పోషక విలువలు నష్టపోకుండా, తక్కువ ధరలో సమతుల ఆహారాన్ని తయారు చేయడం ఎలాగో నేర్పించడమైనది. భోజనం తయారు చేయడం లో, ఆహారధాన్యాలు ఇతర సామాగ్రి ని ఎంచుకోవడం,జాగ్రత్త గా నిలువచే సుకోవడం మరియు ఇతర ఆరోగ్య సంరక్షణ పద్ధతులును నేర్పించడమైనది. ఈ కార్యక్రమంలో శ్రీ ఇ వి నరసింహ రెడ్డి, ఐ ఎ ఎస్ , డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు ముఖ్య అతిథి గా విచ్చేసి ఆరోగ్య పరంగా ఆహార ప్రాముఖ్యతను, స్కూళ్లలో అందించాల్సిన ఆహార నాణ్యతను వివరించారు. పిల్లలకు పోషకాహారం అందించడం ఎంత అవసరమో, కూరగాయల ప్రాముఖ్యత మరియు పోషకాహారంపై అవగాహన ఎలా కల్పించాలో వివరించారు. పాఠశాల సిబ్బంది ప్రేమ మరియు బాధ్యత ద్వారా ఆరోగ్యకరమైన భావి తరాన్ని తయారు చేసే గురుతర బాధ్యత ను ప్రభుత్వం వారి భుజస్కంధాల పై ఉంచిందన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డా. వి. విజయలక్ష్మి గారు మాట్లాడుతూ వంటదినుసులు కొనుగోలు సమయంలో అనుసరించవలసిన నాణ్యత ప్రమాణాలు, పాఠశాల ఆవరణలో పెరటి తోటలు పెంచాలని తద్వారా నాణ్యమైన ఆకుకూరలను మధ్యాహ్న భోజనం లో చేర్చడం ద్వారా నాణ్యతను పెంచవచ్చని సూచించారు. ఈ శిక్షణలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, వంట సిబ్బంది ఆహారం మరియు పోషణ విభాగ అధిపతి డా. టి సుచరిత దేవి, అధ్యాపకులు డా పి.జానకీ శ్రీనాథ్ మరియు డా టి సుప్రజ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అత్తాపూర్ జూన్4,ప్రభాతవార్త :

రాజేంద్రనగర్ సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ షాక్ తో గత సంవత్సరంలో మాలే తిమ్మారెడ్డి మరణించారు. మహబూబ్ నగర్ జిల్లా నుండి బతుకుదెరువు కోసం గండిపేట్ మండలంలోని గంధంగూడ వెంకటేశ్వరనగర్‌కు బతుకుదెరువు కోసం వలస రావడం జరిగింది. గత సంవత్సరం 7/6/2024 నాడు కూలి పనికి వెళ్లగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించారు. అతనికి భార్య మాలే సుశీల ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. బుధవారం ప్రభుత్వ నుండి 4 లక్షల 50 వేల రూపాయలను రాజేంద్రనగర్ సబ్ డివిజన్ ఏ డి ఈ సత్యనారాయణతో కలసి వనంపల్లి జైపాల్ రెడ్డి బాండు ఇప్పించారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సర్వే నెంబర్ 178కి సంబందించి పట్టాపాసుపుస్తకాలు ఇవ్వాలి

పెద్దేముల్, జూన్ 4, ప్రభాతవార్త: పెద్దేముల్ మండలంలోని జనగాం గ్రామ శివారులోని సర్వేనెంబర్ 178 కి సంబందించిన లావాణిపట్టా భూములకు గానురైతులకు పట్టాపాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెవిన్యు సదస్సులలో భాగంగా బుదవారం జనగాం గ్రామంలోని రైతులు డిప్యుటి తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు స్వామిదాసు,రాంరెడ్డి, నర్సిములు, ఏసప్ప, లక్ష్మమ్మ, వెంకటప్ప తదితరులు మాట్లాడుతూ గత 50 ఏళ్ళుగా తామందరము కబ్జాలో ఉండటమే కాకుండా అట్టి భూములను సాగుచేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నామని అన్నారు. అట్టి భూమికి సంబందించిన పట్టాపాసుపుస్తకాలు ఇవ్వాలని, కొనుగోలు, అమ్మకాలు జరపడానికి హక్కులు కల్పించాలని అన్నారు. అంతేగాకుండా అట్టి భూములపై బ్యాంకులు, సొసైటీలు పంటరుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రెవిన్యు సదస్సులో మిస్సింగ్ సర్వే నెంబర్లు 4, డిఎస్ పెండింగ్ 2, నేమ్ కరెక్షన్ 1, పెండింగ్ సక్సేషన్ 3 వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యా

జిల్లేడు చౌదరి గూడెం, జూన్ 4, ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప అన్నారు. బుదవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్, చౌదరిగూడ, తూంపల్లి గ్రామాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటప్ప మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ప్రైవేటు మోజులో పడి డబ్బులు వృదా చేసుకోవద్దని అన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం పాఠశాలలో అనేక వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాలని ఆయన తెలిఎపారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

-ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారథి

షాద్‌నగర్ జూన్4, ప్రభాతవార్త, : రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్న మండల తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభించారు. అదేవిధంగా మండలంలోని శేరిగూడ గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తమ సందేహాలను సదస్సుల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్యుమెంట్లు లేనివారు, గతంలో తప్పులు పడిన వాటిని సంబంధించిన అనేక సమస్యలను ప్రజలు రెవెన్యూ సదస్సు దృష్టికి తీసుకువస్తున్నారని వారు పేర్కొన్నారు. రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించే విధంగా సదస్సులు కొనసాగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా శేరిగూడ గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ సింగ్‌ను కలిసి గ్రామస్థుల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని మాజీ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అందజేశారు

మా పాట్లు మాకు ఇప్పించండి సారూ...

కీసర,జూన్4,ప్రభాతవార్తః

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి గ్రామంలోని సర్వే నంబరు 414 లో పాట్లు గల భాదితులు తమ పాట్లు తమకు ఇప్పించాలని బుదవారం తహశీల్దార్‌తో మొరపెట్టుకున్నారు.ఈ సందర్భంగా భాదితులు విలేఖరులతో మట్లాడుతూ సర్వే నంబరు 414లో 11 ఎకరాల 29 గుంటల భూమి ఉండగా అందులో 7 ఎకరాల 32 గుంటల భూమిని జిపిఏ హోల్డర్ మీరవెళ్లి దగ్గర నుండి 1990 సంవత్సరంలో సుమారు వంద మంది కలిసి 200 వందల గజాల చొప్పున కొనుగోలు చేయడం జరిగిందన్నారు.ఇదే లే అవుట్ ను చెడకొట్టి మరలా 2002 సంవత్సరంలో కొత్త లే అవుట్ 414 సర్వే నంబరుకి బై నంబర్లు వేసి 100 గజాల చొప్పున వేరే వారికి అమ్మడం జరుగుతుందన్నారు.1990లో పాట్లు కొనుగోలు చేసిన వారు వారి పాట్ల దగ్గరికి వెళ్లగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరిస్తున్నారన్నారు.ఇట్టి లే అవుట్ విషయమై 1993,2016లో హై కోర్టులో పిటిషన్ వేయగా కేసు ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు.పాట్లు కొన్న సుమారు వంద మంది అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని తహశీల్దార్‌కి,ఆర్‌డిఓకి,కలెక్టర్‌కి ఫిర్యాదు చేశామన్నారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు.రాంపల్లి గ్రామ పంచాయతీ ఉన్నట్టు అక్రమ అనుమతులు పొంది కొంతమంది ఇంకా గ్రామ పంచాయతీ పర్మిషన్ తోనే ఇండ్ల నిర్మాణాలు చేస్తుంటే నాగారం మున్సిపల్ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని భాదితులు మీడియాకి తెలిపారు. ఇప్పటికైనా తమ ప్లాట్లను తమకు ఇప్పించకుంటే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని పాట్ల యజమానులు హెచ్చరించారు.

రాజేంద్రనగర్ మండల పరిధిలో ఉన్న 46 ప్రభుత్వ ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న రాజేంద్రనగర్ పిఓ ఎ స్వాతి ,సిఓలు

రైతుల సంక్షేమం కోసమే భూభారతి చట్టం : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట జూన్ 4 ప్రభాతవార్త రైతులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చామని అన్నారు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. బుధవారం కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో రెవెన్యూ సదస్సును, లేమామిడి, మరియు తురకలపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం లేమామిడి గ్రామంలోని రైతు వేదికలో గ్రామస్తులు ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సరిదిద్దడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం అని ఎమ్మెల్యే శంకర్ వెల్లడించారు. ఈ భూభారతి చట్టం ద్వారా రైతులందరికీ మేలు జరుగుతుందని ఆయన అన్నారు. భూభారతి సదస్సుకు, మరియు ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన పలు విషయాలను ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో పలు విషయాలపై చర్చించారు. అనంతరం కేశంపేట తహసీల్దార్ ఆజం అలీ మాట్లాడుతూ బుధవారం ఇప్పలపల్లి లో 5, లేమామిడిలో 5 మొత్తం 10 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆజం అలీ, ఇన్చార్జి ఎంపీడీవో కిష్టయ్య, షాద్ నగర్ వ్యవసాయం మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, కేశంపేట తాజా మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, షాద్ నగర్ వ్యవసాయ

లేమామిడి రైతు వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మార్కెట్ కమిటీ మార్కెట్ డైరెక్టర్లు కరుణాకర్, చేదురువల్లి భాస్కర్ గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీధర్ రెడ్డి,గిరి యాదవ్ ,కరుణాకర్ రెడ్డి,ఏ. శ్రీనివాస్ గౌడ్,ఏ. ప్రకాశ్ గౌడ్ , రావులపెంటయ్య ముదిరాజ్, జూలపల్లి అనసూయ ముదిరాజ్, అమేర్,రమేష్,లక్ష్మయ్య, బాలాజీ, ఆంజనేయులు, సుదర్శన్, కోరుడు రాములు, తైద పర్వతాలు, తాళ్ల నరసింహులు గౌడ్, అంజయ్య, సమీర్,గోపాల్, పాండు,సరికొండ రమేష్, అఖిల్ ,రాఘు వేందర్,అజహర్ ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తలకొండపల్లికి బస్సును పునరుద్ధరించాలని ఎమ్మెల్యేకు వినతి

-ఎమ్మెల్యే డిపో మేనేజర్‌కు ఫోను

- స్పందించి వెంటనే రూట్ మ్యాప్ ఖరారు

తలకొండపల్లి జూన్ 4, ప్రభాతవార్త: తలకొండపల్లి మండలానికి గతంలో నడుస్తున్న ఆర్టీసీ బస్సును నిలిపివేయడంతో అదే రూట్లో మళ్ళీ ఆర్టీసీ బస్సును పునరుద్ధరింప చేయాలని కోరుతూ బుధవారం నాడు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి గట్టు ఇప్పల పల్లి గ్రామస్తులు వినతిపత్రం అందించారు. గత ఎన్నో సంవత్సరాలుగా కల్వకుర్తి నుంచి మార్చల మీదుగా జిల్లెల్ల ,జకినాలపల్లి, గట్టిపల్లపల్లి, మెదక్ పల్లి, రాంపూర్ , చంద్ర ధన, తలకొండపల్లి వరకు ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళలో ఆర్టీసీ బస్సు నడిచేదని గత కొన్ని సంవత్సరాలుగా ఈ బస్సును అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రతిరోజు తలకొండపల్లి మండల కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, రవాణా సౌకర్యం లేక నిరుపేద ప్రజలు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి బస్సు గురించి వివరించగా వెంటనే కల్వకుర్తి డిపో మేనేజర్ సుభాషినికి ఫోన్ చేసి మాట్లాడారు. గతంలో కల్వకుర్తి నుంచి తలకొండపల్లి వరకు వెళ్లే ఆర్టీసీ బస్సును వెంటనే పునరుద్ధరింప చేయాలని తెలిపారు. స్పందించిన డిపో మేనేజర్ సుభాషిని హుటాహుటిన కల్వకుర్తి , జకినాలపల్లి ,గట్టు ఇప్పల పల్లి మీదుగా తలకొండపల్లి వెళ్లే రోడ్డు మార్గాన్ని రోడ్డు మ్యాప్ ను పరిశీలించారు.

గట్టు ఇప్పలపల్లి గ్రామంలో రూట్ మ్యాప్ పరిశీలిస్తున్న కల్వకుర్తి డిపో మేనేజర్‌కు మినపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఈ సందర్భంగా డిపో మేనేజర్ సుభాషిని గ్రామస్తులతో మాట్లాడుతూ కల్వకుర్తి నుంచి యధావిధిగా తలకొండపల్లి వరకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె రేణు రెడ్డి, నాయకులు అంజయ్య, శివ కుమార్, నరేందర్ గౌడ్, మల్లేష్, శ్రీనివాసులు, రాములు, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో ధూల్‌పేట యువకుల హల్‌చల్

షాద్‌నగర్ జూన్4,ప్రభాతవార్త, : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై కొందరు ఇతర ప్రాంతానికి చెందిన యువకులు మకాం వేశారు. రాబోయే బక్రీద్ పండగను పురస్కరించుకొని పశు రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో అక్రమ పశు రవాణాపై ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైనా గోవులను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే పోలీసు అధికారులు ప్రకటించారు. అయితే షాద్‌నగర్‌లో భిన్నంగా కొంత మంది యువకులు ధూల్‌పేట నుండి బృందంగా ఏర్పడి స్థానిక చటాన్‌పల్లి జాతీయ రహదారి వద్ద మకాం చేశారు. వచ్చిపోయే వాహనాలను పహారా కాస్తూ వారే స్వయంగా తనిఖీ చేస్తున్నారు. పశువులు కనిపించిన ఇతర ధృవపత్రాలు వారి వద్ద రవాణా అనుమతి ఉన్నప్పటికీ వారితో ఘర్షణలకు దిగుతూ చేయి చేసుకుంటున్నారు. షాద్‌నగర్ వద్ద నవాజ్, హబీబ్ అనే యువకులను వాహనం నుండి కొందకు దింపి దాడి చేసే ప్రయత్నం చేశారు. వారి చేతుల్లో ఉన్న సెల్‌ఫోన్లు లాక్కున్నారు. రోడ్డుపైకి వచ్చిన పోయే వాహనాలను ఆపుతూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. వారి చేతుల్లో రాడ్లు, కర్రలు ప్రదర్శిస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఇప్పటికే పోలీసులు హైవేపై రోడ్లపై చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచారు. అక్రమ పశు రవాణాను వారు అడ్డుకునేందుకు అన్ని విధాల చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. చట్టపరంగా వారు చర్యకు ఉపక్రమిస్తున్నారు. అయితే హైదరాబాద్

షాద్‌నగర్ బైపాస్ రహదారిలో కాపుకాచిన హైదరాబాద్ యువకులు

ధూల్‌పేట నుండి పశు రవాణాను అడ్డుకునే ముసుగులో యువత కొందరు చట్టాన్ని వారి చేతుల్లోకి తీసుకొనే విధంగా ముందుకు వచ్చారు. బుధవారం బైపాస్ రహదారిపై అన్ని అనుమతులతో దున్నపోతులు, ఎడ్లను మహబూబ్‌నగర్ ప్రాంతం నుండి హైదరాబాద్ జహానుమకు తీసుకువెళ్తున్న వాహనాన్ని (టీజీ06టీ1777)ను అటకాయించారు. సదరు వాహన డ్రైవర్ హబీబ్బఐ దాడి చేసే ప్రయత్నం చేశారు. అయితే బాధితుడు వెంటనే 100కు ఫోన్ చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఐదు దున్నపోతులను, మూడు ఎడ్లను గోశాలకు తరలించారు. అయితే ఈ రవాణాకు అనుమతి ఉండడంతో మహబూబ్‌నగర్ నుండి రాజధాని వెళ్తున్నాయి. పశుసంవర్ధక శాఖ ధృవపత్రంతో పాటు రవాణా అనుమతి కూడా వీటికి ఉంది.

-బైపాస్ అడ్డాగా పశు రవాణాపై పహారా

-అనుమతి ఉన్న పశువుల వాహనాన్ని అడ్డుకున్న బృందం

-వాహన డ్రైవర్, తదితరులపై దాడికి యత్నం

-గోశాలకు పశువుల తరలింపు

అయినప్పటికీ ఈ బృందం అడ్డుకొని వారిపై దాడి చేయడం గమనార్హం. పోలీసులు కూడా వాటిని ఓవర్ లోడ్ పేరిట గోశాలకు తరలించడం గమనార్హం. సదరు యువకులు వాహన డ్రైవర్ల వద్ద లాక్కున్న సెల్‌ఫోన్లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అయితే ఇప్పుడు ఇప్పుడు ఓవర్‌లోడ్ అంటూ సదరు యువకులను పోలీసులు వారి అదుపులోనే ఉంచుకున్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు

- ఎసిపి లక్ష్మీనారాయణ

అక్రమ పశు రవాణాపై తమ దృష్టికి వస్తే చట్ట ప్రకారం తామే చర్యలు చేపడతామని షాద్‌నగర్ ఏసీపీ ఎస్.లక్ష్మీనారాయణ వెల్లడించారు. చటాన్‌పల్లి బైపాస్ జాతీయ రహదారి వద్ద పశువుల రవాణా వాహన విషయాన్ని మీడియా ఏసీబీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి మాట్లాడారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎవరైనా సరే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం వివరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇతర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి వాహనాలు పట్టుకునే అధికారం ఎవరికీ లేదని ఏసీపీ స్పష్టం చేశారు. అలాంటివి తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

కొందుర్గు (జూన్4), ప్రభాతవార్త, : అందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, అందుకుగాను ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప పిలుపునిచ్చారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మండల పరిధిలోని అయోధ్యపూర్ తండా, కొందుర్గులో బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారి బాలబాలికలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్, చౌదరిగూడ మండల ప్రధాన కార్యదర్శి ప్రకాష్, పిడబ్ల్యుఎఫ్ కన్వీనర్ శ్రీరాములు, కార్యదర్శి సంజీవతో పాటు సంఘం సీనియర్ నాయకులు నర్సింలు, విజయ్ గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొందుర్గులో బడిబాట నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్

గంజాయి విక్రయాలు జరిపితే కఠిన చర్యలు

-ఇంచార్జ్ సిఐ శ్రీనివాస్

ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితుడు

పెద్దేముల్, జూన్ 4, ప్రభాతవార్త: గంజాయి కలిగియుండుట, సేవించుట, ఇతరులకు విక్రయించిన కఠిన చర్యలు తప్పవని తాండూరు ఇంచార్జ్ సిఐ శ్రీనివాస్‌హెచ్చరించారు. ఎస్‌హెచ్‌ఓ తాండూరు టీమ్, డిటిఎఫ్ వికారాబాద్ టీమ్ ఎక్సైజ్ పోలీసులు పెద్దేముల్ మండలం తట్టెపల్లి గ్రామంలోని మహ్మద్‌మియ్యా గంజాయి కొనితెచ్చి సేవిస్తున్నాడనే సమాచారంతో మంగళవారం సాయంత్రం అతని ఇంటి పరిసరా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించగా అక్కడ 125 గ్రాములఎండు గంజాయి లభించింది. గంజాయి కలిగియున్న, సేవించిన, అమ్మిన నిషేదం కావున మహ్మద్‌మియ్యాపై ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసిరిమాండ్ తరలించినట్లు సిఐ తెలిపారు. ప్రభుత్వ నిషేదిత గంజాయిని విక్రయించిన, కొనుగోలు చేసిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇట్టి దాడులలోఎస్‌ఐలు ఆదిశేషరెడ్డి, నిజాముద్దిన్,సిబ్బంది భీమయ్య, రవి కిషోర్, రవి కిరన్, కుమార్, విష్ణు, శివప్రసాద్, హనుమంతు, ఆసిఫాభేగం, రాధిక, మహేందర్, సతీష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

-సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి

షాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:

రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి రెవెన్యూ చట్టం 2025 తీసుకువచ్చిందని సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండలం రుద్రారం గ్రామంలో రెవెన్యూ సదస్సులోఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల భూ సమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం స్పష్టమైన చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. చాలాకాలంగా రైతులు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూముల సమస్యలు ఉదాహరణకు పట్టాదారు పాసుపుస్తకంలో పేర్లు తప్పుగా నమోదు కావడం, భూ విస్తీర్ణంలో తప్పుగా నమోదు కావడం లాంటి సమస్యలతో పాటు మరెన్నో పరిష్కరించేందుకు నూతన చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో భూమి సంబంధిత సమస్యల ఆర్జీలను తీసుకుని అధికారులు అక్కడే పరిశీలించి పరిష్కరిస్తారని వివరించారు. రెవిన్యూ సదస్సులను రైతులు భూ యజమానులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు తహసీల్దార్ అన్వర్, సిఐ కాంతారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దూరి మల్లేష్, మాజీ సొసైటీ చెర్మన్ మహేందర్ గౌడ్, యాదిరెడ్డి, వేణుగోపాల్, బంధయ్య అధికారులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్సులు నడిపించాలని కాంగ్రెస్ నాయకుల వినతి

డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు వినత పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్, జూన్ 4. ప్రభాతవార్త ః మేడ్చల్ రాయిలాపూర్ బస్సులను పునరుద్ధరించాలని కోరుతూ మేడ్చల్ బస్ డిపో అసిస్టెంట్ మేనేజర్ రామారావుకు మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి వినతి పత్రం అందజమేడ్చల్ రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కారణంగా బస్సు సౌకర్యం నిలిపివేయడంతో గిర్మాపూర్, శ్రీరంగవరం, రాయిలాపుర్, బండ మాదారం, పరిసర గ్రామాల ప్రజలతో పాటు పాలిటెక్నిక్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వినతిలో పేర్కొన్నాడు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయినందున నిలిపివేసిన బస్సులను యదావిదిగా నడుపాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రమణారెడ్డి, నాయకులు సుదర్శన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, చంద్రయ్య గౌడ్, టైలర్ రాజు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కల ప్రతి పేదవాడికి పక్కాఇల్లు

-చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పామేన భీమ్‌భరత్

మొయినాబాద్, జూన్ 4, ప్రభాతవార్త : మొయినాబా మండలం అజీజ్‌నగర్ గ్రామంలో తెలంగాన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధి దారులకు చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, పామేన భీమ్‌భరత్ లబ్ధిదారులకు నియామక పత్రాలు అందజేసి, వారి ఇంటిని ప్రారంభించారు, ఈ స్కీమ్ ద్వార అర్హులైన పేదలందరికి సోంత ఇల్లు కట్టుకునేందుకు రూ 5లక్షలు ఆర్థిక సంవత్సరానికి గాను, ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇండ్లను కేటాయించింది కాగా మెదటి విడతలో సోంత ఇంటి స్థలం కలిగినవారికి ఇండ్లను కేటాయిస్తుంది ప్రజా ప్రభుత్వం అన్నారు, వచ్చే విడత నుంచి ఇంటి స్థలం లేని వారికి ప్లాట్ మంజూరు చేసి 5లక్షలతో ఇండ్లు నిర్మించనుందని తెలిపారు, ఈ కార్యాక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మొయినాబాద్ మండల అధ్యక్షులు మానయ్య, వైస్ ప్రసిడెంట్ రవీందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షులు కొత్త జైపాల్ రెడ్డి, కుమ్మరి వెంకటేష్, మాజి సర్పంచ్‌లు సత్యనారాయణ, వీరభద్ర స్వామి, మాడి వెంకట్ రెడ్డి, కరణ్ కుమార్, కేబుల్‌

కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి

-ఎంపీ ఈటల, ఎమ్మెల్యే శ్రీగణేష్

5వ వార్డు జ్యోతి కాలనీలో మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటెల,ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,జూన్ 4 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఆదర్శ నియోజకవర్గంగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌లు తెలిపారు. బుధవారం 5వ వార్డు జ్యోతి కాలనీ రోడ్డు నెం-2లో లక్షలాది రూపాయల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం పనులను వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవడం వలన సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. వీలైనంత త్వరలో బోర్డు ఎన్నికలు నిర్వహించాలన్నారు.కార్యక్రమంలో నామినేటెడ్ మెంబర్ బానుక మల్లికార్జున్, సీనియర్ కాంగ్రెస్ నేతలు తేలుకుంట సతీష్ గుప్త, పెద్దాల నర్సింహ్మ, బోర్డు జలమండలి సూపరిండెంట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

స్పీకర్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలి : ముప్పిడి గోపాల్

స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అభినందిస్తున్న ముప్పిడి గోపాల్ తదితరులు

కంటోన్మెంట్,జూన్ 4 ప్రభాతవార్త: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ రావ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు తొలి చైర్మన్ ముప్పిడి గోపాల్ తెలిపారు. బుధవారం ముప్పిడి గోపాల్ స్పీకర్ ప్రసాద్ రావ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువకప్పి పూలమాలలతో ఘనగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న దర్గ రవికుమార్, కాంగ్రెస్ నేతల స్యామ్ సన్ రాజు, వి. నరేశ్, వేణుగోపాల్ రెడ్డి, సాయికుమార్,ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీగణేష్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలి



ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను అభినందిస్తున్న కాంగ్రెస్ నేత సంతోష్ యాదవ్ తదితరులు

కంటోన్మెంట్,జూన్ 4 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ఆయురారోగ్యాలతో ఉంటూ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని మోండా డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నేత చిరబోయిన సంతోష్ యాదవ్ తెలిపారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఎన్.శ్రీగణేష్ విజయం సాధించి సంవత్సరం పూర్తైన సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను మర్యాదపూర్వ కంగా కలిసి అభినందనలు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముఖ్య నాయకులు, ధికారులు అయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సత్కరించారు.

మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమం

మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నిజాంపేట్, జూన్ 4, ప్రభాతవార్త

తెలంగాణ ప్రభుత్వం రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమం 4వ డివిజన్‌లోని నందనవనం పార్క్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ పురపాలక సిబ్బంది, వార్డ్ ఆఫీసర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు నారాయణ రెడ్డి, సురేంద్ర కుమార్ యాదవ్, పవన్ గుప్తా, సుబ్బు, వెంకట్ రావు, రామారావు, చంద్రశేఖర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

మహేష్ కుమార్ గౌడ్‌ను విమర్శించే స్థాయి నగేష్ ముదిరాజ్‌కు లేదు

సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరిగౌడ్, కృష్ణగౌడ్ తదితరులు

హైదరాబాద్, జూన్ 4,ప్రభాతవార్త:

పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను విమర్శించే స్థాయికి నగేష్ ముదిరాజ్‌ఎదగాలేదని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని కాంగ్రెస్ పిసిసి కార్యదర్శి లక్ పతి యాదగిరి గౌడ్ విమర్శించారు. ఈమేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీమంత్రి హరీష్ రావు జన్మదినాన్ని సందర్భంగా బిఆర్ఎస్ నాయకుడు నగేష్ ముదిరాజ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గతాన్ని మరిచి నగేష్ ముదిరాజ్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. మహేష్ కుమార్ గౌడ్ పై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించే ప్రసక్తే లేదని తీవ్రంగా హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

నిరుపేద కళాకారులం..కానీ గ్రేటర్ సుందరీకరణలో భాగస్వాములం

పండగలు మతాలతో కాకుండా మానవత్వంతో జరుపుకోవాలి : డిసిపి బాలస్వామి

సికింద్రాబాద్, జూన్ 4 ప్రభాతవార్త:

ప్రపంచ దేశాలలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ ముందుందని ఈస్ట్‌జోన్ డీసీపీ బి. బాలస్వామి తెలిపారు. అందుకు తగ్గట్టుగానే శాంతి భద్రతల పరిరక్షణలో కూడా ముందుండాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్‌వ్యవస్థ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. బక్రీద్ సందర్భాన్ని పురస్కరించుకొని జరిగిన కమ్యూనిటీ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలు మతాలతో కాదని, మానవత్వంతో జరుపుకోవాలని హైదరాబాద్ నగరం చూస్తే అర్థం అవుతుందని తెలిపారు. బక్రీద్ అయినా, వినాయక చవితి అయినా, బోనాల జాతర అయినా మతాలకు అతీతంగా జరుపుకుంటారని అన్నారు. ఇలాంటి తరుణంలో కొందరు వ్యక్తుల మూలంగా శాంతి భద్రతలను ఆటంకం కలిగే అవకాశాలు ఉన్నాయని, అలాంటి వ్యక్తులను గుర్తించి పౌరులు సమాచారం అందించాలని కోరారు. పనిగట్టుకొని ప్రశాంతమైన వాతావరణాన్ని పాడు చేసే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంఘంలో కేవలం పీస్ కమిటీలు, వేల్ఫేర్ కమిటీలు మాత్రమే కాదని, ప్రజలు కూడా బాధ్యతల్లో భాగస్వాములేనని తెలిపారు. ప్రతి వ్యక్తి యూనిఫాం లేని పోలీసులేనని గుర్తించాలని, అందుకు తగినట్లుగానే బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. బాధ్యతాయుతమైన పౌరులు ఇప్పటికే పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నారని, మిగతా వారు కూడా భాగస్వాములు కావాలని కోరారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని సంతోషంగా జరుపుకునే

పీస్ కమిటీ సమావేంలో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బి. బాలస్వామి

ప్రక్రియలో ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా ప్రమాణాలను పాటించాలన్నారు. చాలా వరకు నాన్‌వేజ్ తినని వారు కూడా ఉంటారని, వారికి కనిపించే విధంగా రక్తపు మరకలతో కూడిన భాగాలను బహిరంగంగా పడేయకుండా చెత్త డంపింగ్‌కు జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన వాటిలో విధిగా పడేయాలని కోరారు. శాంతి, సామరస్యలతో బక్రీద్ పండుగను జరుపుకోవాలని కోరుతూ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అడిషనల్ డీసీపీ నర్సయ్య మాట్లాడుతూ పండుగలు ప్రతి ఒక్కరు సమ జీవనానికి ప్రతీకలు కావాలని, ప్రశాంత వాతావరణానికి, శాంతి భద్రతలకు, సాధారణ జీవనానికి విఘాతం కలిగించేవిగా మారకూడదన్నారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ డివిజన్ ఏసీపీ కే.శశాంక్‌రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ, కాచిగూడ, సుల్తాన్‌బజార్ ఏసీపీలు, పీస్ కమిటీ సభ్యులు డా. అఫీజ్ ముజఫీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో వార్డులపై కఠిన చర్యలకు సిద్ధం

యూసుఫ్‌గూడ, జూన్ 4, ప్రభాతవవార్త :

జూన్ 2వ తేది తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎర్రగడ్డ మెంటల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు తిని ఫుడ్ పాయిజన్ అయిందని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నరసింహ తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటివరకు 92 మంది పేషెంట్లు ఫుడ్ పాయిజన్ కారణంగానే ఆనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మెంటల్ ఆసుపత్రిలో బుధవారం ఆరోగ్యశాఖ మంత్రి రాజా నరసింహ ప్రత్యక్షంగా వెళ్ళి అస్వస్థతకు గురైన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతో మంత్రి మాట్లాడారు. ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఘటనపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మంత్రి దామోదర మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఆస్పత్రి డైట్ కాంట్రాక్టర్‌ను తొలగించాలని మంత్రి దామోదర ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. అస్వస్థతకు గురైన వారందరి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని చెప్పుకొచ్చారు. డైయిట్ కారణంగానే ఈ ఫుడ్ పాయిజాన్ జరిగినట్లుగా తెలుస్తోందని అన్నారు. ఆ రోజు ఒక స్వీట్ కూడా అదనంగా రోగులకు ఇచ్చారని వివరించారు. మంత్రి దామోదర రాంజనర్సింహ అనారోగ్యం పాలైన వారిలో తీవ్రంగా ఉన్న 18 మందిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని మంత్రి వివరించారు. మిగతా రోగులని గాంధీ ఉస్మానియా

ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి దామోదర్ రాజా నరసింహ.

తో పాటు మొత్తం ఆరు వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయని వెల్లడించారు. అనారోగ్యం పాలైన వారి ప్రాణాలకు ప్రమాదం లేదని వారు మరో రెండు రోజుల్లో కోలుకుంటారని వైద్యులు తెలిపారని చెప్పారు. ఇక్కడ డైట్ చూసుకునే కాంట్రాక్టర్ పనితీరు సైతం సరిగా లేదని సమాచారం అందిందని అతని కాంట్రాక్ట్ రద్దు చేశామని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ జరిగిన ఘటనపై ఒక కమిటీని నియమించామని తెలిపారు. కమిటీ రిపోర్టు రాగానే బాధ్యులపై చర్యలు ఉంటాయని అన్నారు. ఇప్పటికే ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైం దని చెప్పారు. చనిపోయిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. కరోనాపై ఆందోళన చెందాల్సిన అవ సరం లేదని మంత్రి దామోదర రాజనరసింహ పేర్కొన్నారు.

శాలిబండ డివిజన్ టిడిపి నూతన కార్యవర్గం

శాలిబండ డివిజన్ టిడిపి నూతన కార్యవర్గం

చార్మినార్,జూన్ 4 ప్రభాతవార్త :

చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం శాలిబండ డివిజన్ టిడిపి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ పరిశీలకులు షమీద్దీన్ రఫీక్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి.శాలిబండ డివిజన్ టిడిపి నూతన అధ్యక్షులుగా అహ్మద్ షరీష్,ప్రధాన కార్యదర్శిగా అర్షియా జబీన్‌లు ఎన్నికయ్యారు.ఈ సమావేశంలో చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి అడ్‌హాక్ కమిటి కమిటి సభ్యులు సయ్యబా తస్నీమ్,కె.జోగేందర్ సింగ్,బి.వై.శ్రీ కాంత్, సయ్యద్ సఫియా ఫాతిమా, అశఫియా జబీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి అడ్‌హాక్ కమిటి సభ్యులు తయ్యబా తస్నీమ్ మాట్లాడుతూ చార్మినార్ నియోజకవర్గంలో టిడిపిని బలోపేతం చేయటానికి నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు.

చిన్నారులను అన్నిరంగాల్లో ప్రోత్సహించడమే జవహర్ బాలభవన్ ధ్యేయం

- జవహర్ బాలభవన్ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మిబాయి

సభలో ప్రసంగిస్తున్న డైరెక్టర్ విజయలక్ష్మి, భీంరెడ్డి, వరకృష్ణ తదితర అతిథులు

నాంపల్లి, జూన్ 4 ప్రభాతవార్త :

చిన్నారుల అన్నిరంగాల్లో అభ్యున్నతి, ప్రోత్సాహకమే జవహర్ బాలభవన్ లక్ష్యమని, ఆ ధ్యేయంతోనే 6 దశాబ్దాలుగా పనిచేయడంతోపాటు ప్రతీ సంవత్సరం వేసవి సెలవుల్లో పిల్లలకు వివిధరంగాల్లో ప్రత్యేక శిక్షణ, వారిలో ద్విగిణీకృతమైన నైపుణ్యాన్ని వెలికితీసి ప్రదర్శనలకు అవకాశం కల్పించి, పోటీలు నిర్వహించి ఎంపికైన విజేతలకు బహుమానాలు అందజేసి ప్రోత్సహిస్తున్నామని బాలభవన్ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మిబాయి తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో జంటనగరాల్లోని 300మందికి పైగా చిన్నారులు వివిధ విభాగాల్లో శిక్షణపొంది తమ ప్రతిభను చాటుకున్నారని వివరించారు. బుధవారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలంగాణ రాష్ట్ర జవహర్ బాలభవన్‌లో ఘనంగా నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం 2025 ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ ఎం.భీంరెడ్డి చిన్నారులు ఎంతో అద్భుతంగా ప్రదర్శించిన సాంస్కృతిక, కూచిపూడి, భరతనాట్య, జానపద నృత్యాలను, సైన్స్, డ్రాయింగ్ తదితర ప్రదర్శనల్లోని పిల్లల ప్రతిభను కొనియాడుతూ వారిని ప్రశంసించారు. చివరిగా భీంరెడ్డి డైరెక్టర్ విజయలక్ష్మిబాయి, విశిష్ట అతిథులు ఏసిపి సిహెచ్.వరకృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ మణిదీప్, బాలభవన్ సహసంచాలకురాలు ఇందిర తదితరులతో కలిసి వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న 300 మంది చిన్నారి విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానంచేసి విద్యార్థుల తల్లిదండ్రులు, బాలభవన్ సిబ్బంది, దాతలు, నిర్వాహకులను అభినందించారు. అనంతరం అతిథులు ప్రసంగించారు.

ప్రజల్లో ఆధ్యాత్మికభావాలు వెల్లివిరియాలి

-ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



పూజలు నిర్వహిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, జూన్ 4 ప్రభాతవార్త:

ప్రజల్లో ఆధ్యాత్మికభావాలు వెల్లివిరియాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్‌లో నిర్మించిన శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ విగ్రహాల పున:ప్రతిష్టాపన మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. నల్ల పోచమ్మ దేవాలయ ధర్మ కర్తల మండలి సభ్యులు కే నర్సింగరావు, జీ వై గిరి, జీ నర్సింగరావు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. బుధవారం గణపతి పూజతో ప్రారంభమై వరుసగా కలశ స్థాపన, అగ్నిప్రతిష్టాపన, పంచగవ్యాదివాసము, క్షీరాధివాసము, జలాదివాస కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలి సభ్యులు రాజు, చందు, సంతోష్, రాము, కుమార్, యాదగిరి, లక్ష్మణ్, బిఆర్ఎస్ నాయకులు ముఠా నరేష్, శ్రీకాంత్, రాజ్ కుమార్, ఎండి గౌస్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు కాగా గురువారం ధాన్యాదివాసము, ఫలాధివాసము, హోమం, హారతి భక్తులకు తీర్థప్రసాద వితరణ, సాయంత్రం పుష్పాదివాసము, సేయాదివాసము, హారతి ఉంటుందని వివరించారు. 6న విగ్రహప్రతిష్ట అనంతరం శాంతి కల్యాణం అనంతరం కలశ ఉద్వాసన, మహాపూర్ణాహుతి, హారతి ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు

వేముల వెంకటేష్ మృతి పట్ల ఆర్ కృష్ణయ్య సంతాపం

సైఫాబాద్, జూన్ 4 ప్రభాతవార్త: జాతీయ వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల వెంకటేష్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆయన మరణం పట్ల అనేక మంది ప్రముఖులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈయన భౌతికకాయంపై రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, సగర సంఘం అధ్యక్షుడు శేఖర్‌సగర, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. వడ్డెర సమాజం కోసం, బిసిల కోసం వేముల వెంకటేష్ చేసిన సేవలను వారు కొనియాడారు.

కన్నుల పండువగా వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం

యూసుఫ్‌గూడ, జూన్ 4, ప్రభాతవవార్త :

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానందనగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో శ్రీ భూనీల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే సుప్రభాత సేవ, నిత్యారాధనలు, యాగశాలలో ధ్వారాతోరణ, ధ్వజ కుంభారాధన, చక్రస్థాన అర్చన, పూర్ణాహుతి, నిత్యహోమం, బలిహరణంతో పాటు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం కనుల పండుగగా జరిగింది. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను కాలనీ పురవీధులల్లో ఊరేగింపు సేవ నిర్వహించారు. ఈ ఉత్సవాలను మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ ప్రారంభించగా స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో నియోజకవర్గం ఎమ్మెల్యే మాదవర కృష్ణారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కళా ప్రదర్శనలు తో నిత్యం కళామయం : జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు

కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు, చిత్రంలో కళావిఎస్.జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, జూన్ 4 ప్రభాతవార్త: త్యాగరాయ గానసభ అటు కళలను పరిరక్షించుకోవడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందుకు సాగడం అభినందనీయమని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ప్రముఖ గాయనీ సంయుక్త శిష్య బృందం ఆధ్వర్యంలో 'త్యాగరాజస్వామి కీర్తనలు-కర్ణాటక సంగీతం' కార్యక్రమం గానసభ 60వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగింది. అనంతరం సంయుక్తను సత్కరించిన అనంతరం జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ పలు రంగాలలో ప్రముఖులు చిత్ర పటాలు ఆడిటోరియంలో ఏర్పాటుతో పాటు ఏడు వేదికల్లో కళా ప్రదర్శనలు తో నిత్యం కళామయం రూపొందిందని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు అన్నారు. ఎందరో మహానుభావులు పేరిట గత కాలపు ప్రఖ్యాతులు స్మరిస్తూ చేస్తున్న కార్యక్రమాలు అపురూపం అని అన్నారు. ఆరు దశాబ్దాల పైగా గాన సభ ప్రస్థానం లో కళా సుబ్బారావు, కళా దీక్షితులు, అనంతరం ప్రస్తుత అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్దన మూర్తి కృషి చేశారని అభినందించారు. కులమతాలకు అతీతంగా ఉచితంగా వివాహాల నిర్వహణకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. దీంతో పాటు శాస్త్రీయ, కర్ణాటక సంగీతాన్ని ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం విశేషమని అన్నారు. ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించడం కళాకారులను, కళలను ప్రోత్సహించిట్లవుతుందని అన్నారు. కార్యక్రమంలో గానసభ పాలకమండలి సభ్యురాలు గుండవరపు గీతాదేవి, సభ్యుడు శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలి

-డాక్టర్ రవి శేఖర్ రెడ్డి

హైదరాబాద్ జూన్4,ప్రభాతవార్త :

నేను సైతం అంటూ ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యతగా ఇంటి ఆవరణలో కానీ, ఖాళీ ప్రదేశం ఎక్కడ కనిపించినా కనీసం ఒక్క మొక్కనైనా నాటాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవి శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం వెంగళరావునగర్‌తో టైప్ పార్క్ చుట్టూ ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ కాలనీ వాసుల సహకారంతో డాక్టర్ రవి శేఖర్ రెడ్డి మొక్కలను నాటారు. పెరుగుతున్న వాతావరణ కాలుష్యానికి తగ్గుతున్న వర్షాభావ పరిస్థితులను, నీటి ఎద్దడి ని మొక్కలు నాటడం ద్వారా నివారించిన వారవుతామన్నారు. మొక్కలు నాటడమే కాకుండా, మొక్కలకు నీరు పోయడము, మొక్క పెద్దది ఐయ్యే వరకు సంరక్షించే భాద్యతను కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమములో రిటైర్డ్ సూపరిండెంట్ ఆఫ్ జైల్స్ ఎం రంగారావు,రిటైర్డ్ ఆర్టీసి చీఫ్ కమర్షియల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఆర్‌అండ్ డి ఎస్.రామ మూర్తి, ప్రొఫెసర్ టి వి.రెడ్డి, సారంగారావు, వాసు, చంద్రశేఖర్, గురునాథ్ రావు, నాగరాజు, భరత్ కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బండి రమేష్‌ని సన్మానించిన కూకట్‌పల్లి రామాలయం కమిటీ సభ్యులు

బండి రమేష్‌ను సన్మానిస్తున్న సభ్యులు

కెపిహెచ్బి కాలనీ, జూన్ 4, ప్రభాతవార్త

కూకట్పల్లి నియోజకవర్గం, కూకట్పల్లి గ్రామంలో వెంచేసివున్న శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కమిటీని ఏర్పాటు చేసిన సందర్భంగా బుధవారం సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్‌ని వారి నూతన కార్యాలయంలో (కైతలాపూర్ రోడ్) కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గొట్టిముక్కల వెంకటేశ్వర రావుని కూడా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యాక్రమంలో స్థానిక నాయకులు మాధవరం (శ్రీనివాస్ రావు (టాకిల్) మేకల సుదర్శన్, చెదురుపల్లి శ్రీనివాస్ గౌడ్, గొండ్లల రవీందర్ గౌడ్, తీగల కృష్ణారావు, ముసలి బాలరాజ్, గుత్తికొండ వెంకట్రావు, అంకెనపల్లి రమేష్, అరిగే శ్రీనివాస్, చేరుకుల రాజు యాదవ్, తూర్పాటి కృష్ణవేణి, ఉప్పల విద్యాకల్పన, భాషిపాక నాగమణి పాల్గొన్నారు.

పార్కింగ్ గొడవ... నిందితుడి అరెస్టు

ఎల్.బి.నగర్ జూన్ 4 ప్రభాతవార్త: పార్కింగ్ గొడవ విషయంలో ఓ వ్యక్తి మరణానికి కారణమైన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మే 21వ తేదీన కొత్తపేట డివిజన్ న్యూమారుతినగర్ కాలనీ వైష్ణవి మోక్షిత అపార్ట్మెంట్లో నివాసం ఉండే గండ్ర నాగిరెడ్డి, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపురంకు చెందిన కృష్ణ నాగోల్ డివిజన్ జైపూరికాలనీ కాంక్రీట్ అపార్ట్మెంట్స్‌లో నివాసం ఉంటున్నాడు. పార్కింగ్ విషయంలో నాగిరెడ్డి, జవాజి కృష్ణల మధ్య పార్కింగ్ విషయంలో గొడవ జరిగింది. తన కారుకు గీతలు పడ్డాయని నాగిరెడ్డి తన కారు వెనక పార్కు చేసిన కారు వల్లే ఇలా జరిగిందని కృష్ణ గొడవకు దిగాడు. ఇరువురి మధ్య జరిగిన గొడవలో నాగిరెడ్డికి బలమైన గాయాలు తగలడంతో ఆసుపత్రికి తరలించగా పరీక్షల నిర్వహించిన వైద్యులు నాగిరెడ్డి మృతిచెందినట్లు నిర్ధారించారు. తన భర్త మరణానికి జవాజి కృష్ణ కారణం అని మృతుడి భార్య గండ్ర అన్నపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అన్నపూర్ణ ఫిర్యాదు మేర

వెంకన్న స్వామి హుండీ లెక్కింపు

మల్కాజిగిరి జూన్4 ,ప్రభాతవార్త : వెంకన్న స్వామి హుండీ ఆదాయం లెక్కింపు మల్కాజ్ గిరి ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో స్వామి వారికి భక్తులు హుండీలో సమర్పించిన కాను కలను బుధవారం ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారి కర్క మోహన్ రెడ్డి సమక్షం లో లెక్కించగా 3,56 940(మూడు లక్షల యాభై ఆరువేల తొమ్మిదివందల నలభై రూపాయలు మాత్రమే) 69రోజుల ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్య నిర్వహణ అది. కారి ఎ బి రవీంద్ర రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ కార్య నిర్వహణాధికారి ఎ బి రవీంద్ర రెడ్డి, ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణా చార్యులు,అర్చకులు తులసి వెంకట రమణా చార్యులు,క్లర్క్ సంద్రా సుధాకర్, దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సానాధి శంకర్ ,హేమంత్ కుమార్ , శ్రీధర్ (రాజు) రవీంద్ర రెడ్డి, శ్రీకాంత్, పద్మావతి భక్తులు, రత్న మాల, సూర్యకుమారి, లలిత ,పద్మ, నాగరాజు, అన్నపూర్ణ,స్వ రాజ్య లక్ష్మీ, నాగమల్లేశ్వరి,వరలక్ష్మీ ,దివ్య ధనలక్ష్మీ, సీతాలక్ష్మీ, గిరీష్, గాంధీ,సత్యనారాయణ భక్తులు పాల్గొన్నారు.

గువ్వల షారన్‌కి నాట్య మయూరి అవార్డు...

తుర్కయంజాల్ జూన్ 4(ప్రభాతవార్త) : మెగా హెల్పింగ్ మరియు మెగా ఈవెంట్స్ అధ్వర్యంలో త్యాగరాయగాన సభలో మెగా హెల్పింగ్ మరియు మెగా ఈవెంట్స్ వారు శిరోమణి. నాట్య మయూరి, సేవా ప్రతిభ మరియు కళా రత్న అవార్డులను ప్రముఖుల చేతుల మీదుగా అందచేశారు.తుర్కయంజల్ మున్సిపాలిటీ కమ్మగూడ తోక్ష కూచిపూడి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు డ్యాన్స్ మాస్టర్ దుర్గా గారి అధ్వర్యంలో విద్యార్థులు గువ్వల షారన్, హర్షిణి, సరస్వతి, భవ్యాంశిక వారి చేసిన కూచిపూడి నృత్యంతో ప్రముఖులను ఎంతగానో సంతోషపరిచారు.నాట్య మయూరి అవార్డ్స్ ని సినీ ఇండస్ట్రీ యాక్టర్ కమెడియన్ 30 ఏళ్ళు ఇండస్ట్రీ పృధ్వి రాజ్ మరియూ హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ డి.సి.పి రామదాసు తేజావత్ నాట్య మయూరి అవార్డులు నీ వారి చేతుల మీదుగా తిసుకున్నారు.ప్రముఖులు మాట్లాడుతూ ప్రతిభ ఉన్నా వారిని గుర్తించి అవార్డులు ఇస్తునందుకు శిరీష రెడ్డిని అభినందించారు.మెగా హెల్పింగ్ ఫౌండేషన్ అధినేత్రి పి.శిరీష రెడ్డి మాట్లాడుతు ఇప్పటి వరకు ఇది 8 వ ఈవెంట్‌గా సింగిల్ లేడీ గా ఎవరి సపోర్ట్ లేకుండ కృషి ని నమ్ముకొని ముందు అడుగు వేసాను మెగా హెల్పింగ్ ఫౌండేషన్ రన్ చేస్తు ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహించడామే నా ఆశయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఎండీ రుద్ర పీపుల్ పవర్ పార్టీ లీడర్ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ అను ప్రసాద్ ఫిల్మ్ టీవీ నటుడు హేమంత్ కి ప్రత్యేక ధన్యవాదాలు అని తేలిపారు.

ప్రధాని మోడీకి మద్దతుగా తిరంగా ర్యాలీ

ముసారాంబాగ్‌లో తిరంగా ర్యాలీ ని నిర్వహిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ తదితరులు

మలక్ పేట ,జూన్ 3 ,ప్రభాతవార్త: దేశ ప్రధాని నరేంద్ర మోడీకి మద్దతుగా ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సలీంనగర్ నుంచి దిల్ షుక్ నగర్ వరకు తిరంగా యాత్ర నిర్వహించి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోడీ భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చి ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ను మెడలు వంచారని తెలిపారు ప్రధాని మోడీకి మనం అందరం మద్దతుగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎక్స్ సర్వీస్ మెన్ రామ కృష్ణ, రాష్ట్ర బీజేపీ కార్యదర్శి ప్రదీప్ దుగ్యాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్ రెడ్డి, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్, నాయకులు సుభాష్ చందర్ జి ,రమేష్ రెడ్డి, గౌర దేవేందర్, యాదగిరి సురేందర్, కొప్పుల దినేష్ ,కొంగర ప్రవీణ్, రంజిత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం : ఏఈ లత

నేరెడ్ మెట్, జూన్ 4ప్రభాతవార్త

విద్యుత్ ఫీడర్ మరమ్మత్తులు, విద్యుత్ స్తంభాల వైర్లకు తాకే చెట్లను ట్రిమ్మింగ్ చేసే కార్యక్రమం ఉన్నందున పరిధిలోని పలు కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వాజ్పేయి నగర్ సబ్ స్టేషన్ ఏ ఈ జి.లత పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాజ్పేయి నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని వివేకానందపురం,సప్తగిరి కాలనీ,భరణి కాలనీ, డిఫెన్స్ కాలనీ,చంద్రబాబు నాయుడు కాలనీ,అమ్ముగూడా ప్రాంతం లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అదేవిధంగా ఆఫీసర్స్ కాలనీ ఫీడర్ లైన్ మర మత్తుల కారణంగా కాకతీయ నగర్ గీతా నగర్ సమతా నగర్ వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏ. ఈ. జి.లత పేర్కొన్నారు. ఇది ప్రజలు గమనించగలరని ఆమె పేర్కొన్నారు.

ఎసిపి సుబ్బరామిరెడ్డిని కలిసిన వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

ఎసిపి సుబ్బరామిరెడ్డిని సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, జూన్ 4 ప్రభాతవార్త: మలక్‌పేట ఎసిపిగా బాధ్యతలు చేపట్టిన సుబ్బరామిరెడ్డిని హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమలో కోట్ల లడ్డు పటేల్, బోనగిరి చంద్రశేఖర్, ప్రణీత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

-సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

తుర్కయంజాల్ జూన్ 4 (ప్రభాతవార్త) : ఆపరేషన్ కగార్ పేరుతో నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం మావోయిస్టులు, ఆదివాసి గిరిజన ప్రజలపై సాగిస్తున్న హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరిపి సమస్యను పరిష్క రించాలని సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సభ్యులు పగడాల యాదయ్య అన్నారు.తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్న గూడలోని సిఐటియు కార్యాలయంలో సిపిఎం తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఎం రంగా రెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచి దేశంలోని ప్రజ లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా సమ స్యలతో సతమతమయ్యే ప్రజలు అసంతృప్తితో చేసే ఉద్యమాలపై కేంద్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతుందని అందులో భాగంగానే ఆపరేషన్ కగారు పేరుతో మావోయి స్టులను బూటకపు ఎన్కౌంటర్ల పేరుతో హతమారుస్తుందని అన్నారు వెంటనే ఈ దుష్ట చర్యలను ఆపి ప్రజాస్వామ్య పద్ధతుల్లో మావోయిస్టులు ఆదివాసి గిరిజన ప్రజలతో శాంతి యుత చర్చలు జరిపి వారు లేవనెత్తిన అంశాలను పరిష్క రించాలని అన్నారు. సమస్యలు ఉన్నంతకాలం ప్రభుత్వాలకు ఉద్యమకారులు ప్రజల నుండి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.రాష్ట్రంలో భూభారతి పేరుతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో భూ సమస్యలను అన్నింటిని పరిష్కరించాలని అన్నారు. అనేక మంది ప్రజల అసైన్డ్ ప్రభుత్వ భూములను ఇప్పటికీ ధరణిలో ఎక్కించక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి వెంటనే ఆన్లైన్లో ఎక్కించే వారికి పాస్ పుస్తకాలు ఇవ్వాల్సి ందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా పట్టణ ప్రాంతా ల్లో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో భూ కబ్జాదా రులు ప్రభుత్వ భూములను యదేచ్ఛగా కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అలాంటి వాటిని గుర్తించి ప్రభుత్వ భూములను కాపాడాలని అన్నారు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ, ఇతర ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ తు రకయంజాల మున్సిపల్ కార్యదర్శి డి కిషన్, కమిటీ సభ్య లు ఎం సత్యనారాయణ, కే అరుణ్ కుమార్, కే శ్రీ రామ్, మూర్తి, కే శారద, బి శంకరయ్య, పి శ్రీనివాసులు, తది తరులు పాల్గొన్నారు

గరుడ అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో మహా కుంభాభిషేకం

-ఉత్సవ కమిటీ చైర్మన్ చేగురి వెంకటరమణ

మహా కుంభాభిషేకానికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ చైర్మన్ చేగురి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, గంగా బాలాజీ, అనిల్ కుమార్ తదితరులు

మలక్ పేట ,జూన్ 3, ప్రభాతవార్త: మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లో ని శ్రీ శ్రీ శ్రీ గరుడ అభయ ఆంజనేయస్వామి, లక్ష్మీ గణపతి సహిత శ్రీ భవానీ శంకర సహిత నవగ్రహ నాగదేవత దేవాలయంలో ఈనెల 6, 7, 8 వ తేదీ లలో మూడు రోజులపాటు మహా కుంభాభిషేకం (సహస్ర ఘటాభిషేకం) తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయం ఉత్సవ కమిటీ చైర్మన్, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం గోపూజ, వేద స్వస్తి , గణపతి పూజ, పుణ్యాహ వాచనం, పంచగవ్య ప్రాశన, దీక్ష దారాణ, రుత్విక్ వ్వరనం, యాగశాల ప్రవేశం, నవగ్రహ వాస్తు యోగిని, క్షేత్రపాలక, రుద్ర, మన్యు, ప్రధానమంటప పూజలు, కలసస్థాపన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సా యంత్రం అగ్ని మధనం, సహస్ర కలస (1008) స్థాపన, గణపతి, నవగ్రహ రుద్రాహవనం మన్యుసూక్త పారాయ ణం, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ తది తర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 7వ తేదీ శనివారం ఉదయం గురు ప్రార్థన, వేద స్వస్తి, మంటప ఆవాహిత పూజలు, మన్యు సూక్త 108 సార్లు హవనం, సహస్ర కలశ వరుణ పూజ (1008), సాయంత్రం 5 గంటలకు మంటప పూజలు, మన్యు , రుద్ర, గణపతి, నవగ్రహ, సూక్త పారాయణాలు , నీరాజనం, రాత్రి తీర్థ ప్రసాద వితరణ, 8వ తేదీ ఆదివారం ఉదయం సహస్ర 1008 కలశ ఉద్వాసన, దేవాలయ శిఖర మరియు శ్రీశ్రీశ్రీ గరుడ అభయ ఆంజనేయ స్వామి వారికి సహస్ర ఘటా భిషేకం, మహా కుంభాభిషేకం, బలి ప్రధానం, మహా పూర్ణాహుతి, శిఖరానికి పూర్ణాభిషేకం, శ్రీ సీతారాముల కళ్యాణం, వేద ఆశీర్వచనం, అన్నదానం, ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించను న్నట్లు వివరించారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మా ర్కెట్లో దేవాలయం నిర్మించి 33 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ మహా కుంభాభిషేకం, సహస్ర ఘటాభిషే కం తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించ నున్నట్లు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని చేగురి వెంకటరమణ కోరారు. అదేవిధంగా దేవాలయం మహాకుం భాభిషేకం, సహస్ర ఘటాభిషేకానికి సంబంధించిన కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, ఉపాధ్యక్షులు దుగ్గ జగదీష్ కుమార్, మాదారం కృష్ణ, సభ్యులు గంగా బాలాజీ, విశ్వం, తల్లం శ్రీకాంత్, అనిల్ కుమార్, నూక సంతోష్, గందే శ్రీధర్, ప్రమోద్, సురేష్, మైల రవికాంత్, వెంకటేష్, అజయ్ కుమార్, బి. సురేందర్, రజనీకాంత్, ఓం ట్రేడర్స్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప కళ్యాణోత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవడం హర్షణీయం

-సామల రంగారెడ్డి

సామల రంగారెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న బాలాపూర్ కురుమలు

సరూర్‌నగర్, జూన్ 4 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో శ్రీ బీరప్ప స్వామి, కామరాతి దేవి కళ్యాణ మహోత్సవాల సందర్భంగా బాలాపూర్ గ్రామ పెద్దలు, మాజీ పోలీస్ పటేల్, సరూర్ నగర్ మండల పరిషత్ పూర్వ మాజీ అధ్యక్షుడు సామల రంగారెడ్డిని ఉత్సవ నిర్వాహకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కురుమ సంఘం, బీరప్ప ఉత్సవాల కమిటీ నాయకుల ఆహ్వానం మేరకు రంగారెడ్డి సాంప్రదాయ బద్ధంగా జరిగిన ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు రంగారెడ్డిని కురు మల సాంప్రదాయ కండువాతో సన్మానించి బీరప్ప కళ్యాణ మహోత్సవాలకు సంబంధించిన జ్ఞాపికను అందజేశారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ స్వగ్రామం బాలాపూర్‌లో బీరప్ప కళ్యాణ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా సాంప్రదాయబద్ధంగా శాంతియుతంగా జరపడం హర్షణీయమని అన్నారు. ఈమేరకు ఆయన కురుమ సంఘాన్ని, ఉత్సవ నిర్వాహకులను, కురుమ కుటుంబాలను అభినందిం చారు. ఈ కార్యక్రమంలో కురుమ కుల పెద్ద, సెల్వోజి గుం డ్ల కొమురయ్య, బాలాపూర్ కురుమ సంఘం అధ్యక్షుడు ఇక్కె వెంకటేశ్వర్ (కొండల్), ఉపాధ్యక్షులు రావుల మహేం దర్, కోండ్రు రాజు, బీరప్ప దేవాలయ కమిటీ ఉపాధ్యక్షుడు రావుల లింగం, కార్యవర్గ సభ్యుడు ఇక్కె శ్రీశైలం, చిత్తాపురం సత్తయ్య బాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫామింగ్ టీచర్స్ సమ్మిట్ ప్రారంభం

టీచర్స్ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న ఎస్.ఎం.ఆర్.పి.ఎస్.ఏ అధ్యక్షుడు వీరేందర్ బాబు

సైదాబాద్, జూన్ 4 ప్రభాతవార్త: సైదాబాద్ మండల్ రికగ్నైజ్డ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (ఎస్.ఎం.ఆర్.పి.ఎస్.ఏ) ఆధ్వర్యంలో వినయ్ నగర్ కమ్యూనిటీహాల్‌లో ట్రాన్స్‌ఫామింగ్ టీచర్స్ సమ్మిట్..2025 పేరిట ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. బుధ, గురువారం రెండు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంతోష్‌నగర్ ఎసిపి సుఖ్ దేవ్ సింగ్, ఎస్.ఎం.ఆర్.పి.ఎస్.ఏ అధ్యక్షుడు ఎన్.వీరేందర్ బాబులు హాజరయ్యారు. నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం ఉపాధ్యాయులు ఆధునిక బోధనా పద్ధతుల గురించి తెలుసుకోవడం, క్లాస్ రూం ఓరియంటేషన్, స్టుడెంట్ డెవలప్ మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, యాంగర్ కంట్రోల్ ప్రోగ్రాం, టైం మేనేజ్ మెంట్, హెల్త్ మేనేజ్‌మెంట్, విద్యావిధానంలో నూతన టెక్నాలజి వినియోగం, విద్యార్థుల చదువుపై కరోనా ప్రభావం, ఏదైనా ప్రమాదం జరిగితే విద్యార్థులకు ప్రాథమిక చికిత్స ఏ విధంగా అందించాలి వంటి అనేక అంశాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం, ఉమెన్స్ సేఫ్టీ గురించి పోలీసులు వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సైంటిస్ట్ శేషసాయి, ఎస్.ఎం.ఆర్.పి.ఎస్.ఏ కార్యదర్శి సత్యం, కోశాధికారి మహ్మద్ ఐరిష్ సల్మాన్, సెయింట్ మాజ్ హై స్కూల్ కరస్పాండెంట్ సాజిద్, సెయింట్ డామ్నిక్స్ స్కూల్ కరస్పాండెంట్ అంకిత రెడ్డి, మెంటర్ ధర్మేందర్ కుమార్, సైదాబాద్ మండల పరిధిలోని ప్రైవేటు స్కూల్స్ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

టీచర్స్ సమ్మిట్‌కు హాజరైన ఉపాధ్యాయులు

వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై అవగాహన

వంద రోజుల యాక్షన్ ప్లాన్ అవగాహన కార్యక్రమానికి హాజరైన మీర్‌పేట్ డివిజన్ల మహిళలు

సరూర్‌నగర్, జూన్ 4 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమీషనర్ ఆర్. జ్ఞానేశ్వర్ కార్పొరేషన్ ప్రజలను కోరారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ సందర్భంగా గురువారం ఆయన 40, 41 వార్డుల్లో కార్పొరేషన్‌కు సంబంధించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, స్వచ్ఛ ఆటోలు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం తదితర అంశాలపై ఆయన ప్రజలకు వివరించారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో నిర్దేశించిన కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు ప్రజలు చైతన్యవంతులై కార్పొరేషన్‌కు సహకరించి వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం సందర్భంగా హాజరైన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి (సరూర్‌నగర్, ప్రభాతవార్త)

29న ఎటువంటి ఎన్నికలు ఉండవు

- సైదాబాద్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాలనీ కార్యదర్శి శ్యామ్ సుందర్‌రావు

సైదాబాద్, జూన్ 4 ప్రభాతవార్త: సైదాబాద్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక విషయంలో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదని అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కె.రాజిరెడ్డి, కార్యదర్శి శ్యామ్ సుందర్‌రావులు అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత నెల 18వ తేదీన కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.శేషి రెడ్డి, ఎన్నికల అధికారి ఎ.పుల్లారెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా కె.రాజిరెడ్డిని, కార్యదర్శిగా శ్యామ్ సుందర్ రావు, ఉపాధ్యక్షులుగా సుబ్బలక్ష్మిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. గత నెల 18వ తేదీన జరిగిన ఎన్నికల అనంతరం పుల్లారెడ్డి ఎన్నికల అధికారి బాధ్యతల నుం చి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించి తప్పుకోవడం జరిగిందని, 27వ తేదీన ఆయన పేరిట విడుదల చేసిన సర్క్యులర్ చెల్లదని, ఈ నెల 29వ తేదీన ఎటువంటి ఎన్నికలు ఉండవని రాజిరెడ్డి, శ్యామ్‌సుందర్‌రావులు స్పష్టం చేశారు. మిగిలిన కార్యవర్గాన్ని త్వరలోనే పూర్తి చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రెండు సంవ త్సరాల కాలంలో ఎటువంటి అవకతవకలు లేకుండా, ఆర్థిక సంబంధిత విషయంలో పారదర్శకత పాటిస్తూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్య క్రమంలో విజయ భాస్కర్, బి.ఎల్.నారాయణ రావు, ఎన్.ఎస్.ఆర్ మూర్తి, ఎండిఎఫ్ ఖాన్ పాల్గొన్నారు.

ఉత్తమ బోధనతోనే మంచి ఫలితాలు

విద్యార్థులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఎల్.బి.నగర్ జూన్ 4 ప్రభాతవార్త: ఉత్తమ బోధన ద్వారానే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలుగుతున్నారని నారాయణ కళాశాల కోర్ డీన్ వెంకటరెడ్డి, జిఎం గోపాల్‌రెడ్డి, డీన్ మదనాచారి, ఏజీఎం సదాశివ డు, ప్రిన్సిపల్ సురేష్ పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్ 2025 ఫలితాలలో నారాయణ ఎల్బీనగర్ స్టార్ సూపర్ సీవో స్కూల్ విద్యార్థులు ఫలితాలలో ఎల్బీన గర్ సిఓ స్కూల్ నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరి 20వ ర్యాంక్ సాధించిన అనిరుద్‌రెడ్డి, ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 131వ ర్యాంకు సాధించిన రిత్విక్ మణి సాయి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధమైన స్టార్ సూపర్ సీఓ స్కూల్ ప్రోగ్రామ్ వల్ల ఇంటర్మీడియట్ సులభతరమైందన్నారు. అత్యుత్తమ బోధన ద్వారానే మంచి ర్యాంకు సాధించగలిగామన్నారు. ఉత్తమ ఫలితా లు రావడంతో విద్యార్థు లు భారీ ప్రదర్శన నిర్వహించా రు. అదేవిధంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని జిహెచ్ఎంసి

నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్లు

ఎల్.బి.నగర్ జూన్ 4 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను జిహెచ్ఎంసి పట్టించుకోవడంలేదని కొత్తపేట, సరూర్‌నగర్ కార్పొరేటర్లు నాయికోటి పవన్ కుమార్, ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ప్లాకార్డులతో కార్పొరేటర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు ను తలపిస్తున్న చెరువులు, ట్రాఫిక్ జామ్ లతో వాహన చోదకుల ఇక్కట్లు, వెలగని వీధి దీపాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే జిహెచ్ఎంసి ఏం చేస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్, టిఆర్ఎస్, ఎంఐఎం దోస్తీ చేసి ప్రజలకు పొంగనామాలు పెడుతున్నారని ఆరోపించారు. పేరుకే విశ్వనగరం అని వీధులన్నీ అంధకారంగా మారాయని, కోట్ల అధిరూపాయలు ఖర్చు చేసిన ఎక్కడా రోడ్లు కనిపించడం లేదని అన్నారు.

బీరప్ప స్వామికి యెల్మేటి కుటుంబం ప్రత్యేక పూజలు

కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేస్తున్న టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, జూన్ 4 ప్రభాతవార్త: బాలాపూర్‌లో బీరప్ప స్వామి ఆలయాన్ని సందర్శించిన టిపిసిసి కార్యదర్శి, సీనియర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వగ్రామంలో బాలాపూర్‌లో కురుమ సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బీరప్ప స్వామి, కామరాతిదేవి కళ్యాణ మహోత్సవం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆయన బీరప్ప స్వామి ఆలయాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీరప్ప జాతర మహోత్సవాన్ని జరుపుకున్న కురుమ కుటుంబాలకు అమరేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

స్థానిక సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి

సమస్యలపై వినతి పత్రాలను తీసుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో రాష్ట్ర ఆర